9-12 తరగతుల విధానంపై అధ్యయనం చేయండి

- టెన్త్‌లో ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థీ ఇంటర్ పూర్తి చేయాలి
- కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను సాధించాలి
- యంగ్ ఇండియా గురుకులాల ప్రగతిపై నివేదిక సమర్పించాలి
- విద్యాశాఖ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని, ఇంటర్ పూర్తయ్యే సరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్యాశాఖపై హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి)లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనందున.. ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరముందని సిఎం అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటుందనీ, అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని అధికారులు సిఎంకు వివరించారు. ఇంటర్మీడియట్ వేరుగా, 12వ తరగతి వరకు పాఠశాలలు ఉన్న రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి ఈ విధానంపై సమగ్ర నివేదిక సమర్పించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పనిచేసే ఎన్‌జిఒలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతోపాటు వారి హాజరుపైనా దృష్టిపెట్టాలన్నారు.

యంగ్ ఇండియా గురుకుల విద్యాసంస్థల నమూనాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం సూచించారు. పాఠశాలల నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయాలనీ, నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదికను సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా గురుకుల పాఠశాలల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయినందున, రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నిర్మాణ నమూనాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వి బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, జెఎన్‌టియు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు విస్తరించిన గుడ్‌వర్క్స్ కోవర్క్

హైదరాబాద్ : ప్రముఖ మేనేజ్డ్ ఆఫీస్, కోవర్కింగ్ ప్లాట్‌ఫామ్ అయిన గుడ్‌వర్క్స్ కోవర్క్ తాజాగా హైదరాబాద్‌కు తన కార్యకలాపాలను విస్తరించినట్లు ప్రకటించింది. ప్రఖ్యాత రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎక్తా గ్రూప్‌తో భాగస్వామ్యంతో ఇక్కడి మార్కెట్‌లోకి వ్యూహాత్మకంగా ప్రవేశిస్తున్నట్లు పేర్కొంది. విస్తరణలో భాగంగా హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రెండు ల్యాండ్‌మార్క్ సెంటర్‌లను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఇవి కలిపి 1,50,000 చదరపు అడుగులకు పైగా గ్రేడ్ వన్ స్థలంతో అభివృద్ధి సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని గుడ్‌వర్క్స్ స్పేసెస్ సిఇఒ విశ్వాస్ ముడగల్ తెలిపారు.

రాష్ట్రానికి సరిపడినంత యూరియాను కేటాయించండి

- కేంద్ర మంత్రికి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి సరిపడినంత యూరియాను కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం కేంద్ర మంత్రులు నడ్డా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లకు తుమ్మల లేఖలు రాశారు. వానాకాలం సీజన్ మొదలు కావడంతో రాష్ట్రంలో యూరియా వినియోగం అంతకంతకు పెరిగిపోయిందని పేర్కొన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఐదు లక్షల మెట్రిక్ టన్నుల కోటాను కేటాయించిందని గుర్తు చేశారు. అందులో ఇప్పటివరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని గుర్తు చేశారు. అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. జులై నెలకు కేటాయించిన సరఫరా ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సిన అవసరముందని తెలిపారు. అందులో 60 శాతం దిగుమతి యూరియాను కేటాయించటం సరైంది కాదని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపులు జరగలేదని తుమ్మల తన లేఖలో సోదాహరణంగా పేర్కొన్నారు. పంటలకు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేసేందుకు అదనపు కోటాను కేటాయించాలని మంత్రి కోరారు.

ఫీజు బకాయిలు విడతల వారీగా చెల్లిస్తాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడతల వారీగా చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉన్నత విద్యా కాలేజీ యాజమాన్యాల సమాఖ్య (ఎఫ్ఏటీహెచ్ఐ) ప్రతినిధులు భట్టి విక్రమార్కను కలిసి ఫీజు బకాయిలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్, లా, నర్సింగ్ తదితర కాలేజీలకు మూడేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.వేల కోట్లు పేరుకుపోయాయని తెలిపారు. దీనిపై వివరంగా ఉపముఖ్యమంత్రితో వారు చర్చించారు. ఈ సందర్భంగా సమాఖ్య ఛైర్మన్ నిమ్మటూరి రమేష్‌బాబు వివిధ గణాంకాలతో ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలకు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఎలా చెల్లించొచ్చో ప్రత్యేక ప్రత్యామ్నాయ ప్రణాళిక గురించి వివరించారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ ఈనెల ఏడో తేదీన సచివాలయంలో సంబంధిత మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అధికారిక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు హామీ ఇచ్చారు. ప్రస్తుతం డిగ్రీ తుది సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు నాలుగేండ్లపాటు ఉన్న ఫీజు బకాయిలను, దాంతోపాటు వివిధ కాలేజీలకు మంజూరు చేసిన టోకెన్ మొత్తాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎఫ్ఏటీహెచ్ఐ ప్రతినిధి బృందం ఉప ముఖ్యమంత్రిని కోరింది.

2023 తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు

- 12 మంది ప్రముఖుల ఎంపిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 12 మంది ప్రముఖులను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 సంవత్సరానికి గాను ప్రతిభా పురస్కారాలను ప్రకటించిందని తెలిపారు. ఎలనాగ (కవిత), ప్రభల జానకి (విమర్శ), ఆర్ లక్ష్మీరెడ్డి (చిత్రలేఖనం), సంపత్‌రెడ్డి (శిల్పం), పేరిణి రమేష్ లాల్ (నృత్యం), హరిప్రియ (సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి (పత్రికారంగం), గుమ్మడి గోపాలకృష్ణ (నాటకం), కడకంచి పాపయ్య (జానపద కళారంగం), దూళిపాళ మహాదేవమణి (అవధానం), కె మలయవాసిని (ఉత్తమ రచయిత్రి), శాంతి నారాయణ (నవల/కథ) పురస్కారాలకు ఎంపికయ్యారని వివరించారు. త్వరలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక ఉత్సవంలో పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. పురస్కారంగా ఒక్కొక్కరికీ రూ.20,116 నగదును అందజేసి సత్కరిస్తామని తెలిపారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి రూ.920 కోట్లు ఖర్చు చేశాం

- రుణమాఫీతో 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ధి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత కార్మికుల సంక్షేమానికి రూ.920 కోట్లు ఖర్చు చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతరం పనికల్పించాలనే ఉద్దేశంతో అన్ని ప్రభుత్వ శాఖలు టిజిసిఒ నుంచే వస్త్రాలు కొనుగోలు చేయాలంటూ ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. ఇప్పటికే రూ.579 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ శాఖల నుంచి ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా సిరిసిల్లలోని 16 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. రూ.193 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రుణమాఫీ కోసం రూ.33 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేశామని తెలిపారు. దీంతో 5,691 మంది చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు అన్ని జాతీయ బ్యాంకులతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో చేనేత వస్త్రాల ఉత్పత్తి కోసం తీసుకున్న రుణాలకు మాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

సిఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న బివి రాఘవులు తదితరులు

సిఎం రేవంత్‌ను కలిసిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం సిపిఎం నేతలు కలిశారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నవ తెలంగాణ సిజిఎం ప్రభాకర్, ఎడిటర్ రాంపల్లి రమేశ్ బుధవారం జూబ్లిహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనతో సమావేశమయ్యారు. ఆగష్టు ఒకటిన నిర్వహించబోయే నవతెలంగాణ దినపత్రిక పదో వార్షికోత్సవానికి రావాలని సిఎంను కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. వార్షికోత్సవానికి తప్పకుండా వస్తానంటూ సిఎం ఈ సందర్భంగా హామీనిచ్చారు.

జనవరి 28 నుంచి 31 వరకు మేడారం మహాజాతర

- పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతరగా పేరుగాంచిన సమ్మక్క - సారలమ్మ మహా జాతర 2026లో జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతర జరపనున్నట్టు పూజారుల సంఘం బుధవారం ప్రకటించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావు, కార్యదర్శి చందా గోపాల్ రావు నేతృత్వంలో సంఘ సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. 2026 జనవరి 28న కన్నెపల్లి నుంచి సారలమ్మ, ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామం నుంచి గోవిందరాజు, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం (గంగారం) మండలం పూనగల్లు గ్రామం నుంచి పగిడిద్దరాజు గద్దెలకు చేరుకుంటారు.

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మణ్

- ఇళ్లు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ విప్ బహుమానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మొదటి ఇందిరమ్మ ఇంటిని యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని సైదాపురంలో బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ విప్ బహుమతులు ఇచ్చారు. రాష్ట్రంలో తొలి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసిన ఎగ్గిడి మల్లేష్ దంపతులకు పట్టు వస్త్రాలు, గొర్రె పొట్టేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు రాష్ట్రం వెనుకబడిందన్నారు. రాష్ట్రంలోనే ఆలేరు నియోజకవర్గంలో మొదటి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న బాల మల్లేష్‌ను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో లబ్దిదారులంతా త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వచ్చే నెల రెండో విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. నియోజ కవర్గంలోని గ్రామాల్లో మొట్టమొదటగా ఎవరు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినా గొర్రె పొట్టేలుతోపాటు పట్టు వస్త్రాలు బహుకరిస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రకటించారు.

మంత్రి ముందుగా యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించారు. కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, దేవస్థానం ఇఒ వెంకట్రావు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అందెం సంజీవరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జనగాం ఉపేందర్‌రెడ్డి, పల్లె శ్రీనివా సుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి, నార్మల్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనకచర్లపై చంద్రబాబుతో చీకటి ఒప్పందం

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బనకచర్లపై సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలాడుతున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గురుదక్షిణ చెల్లించుకుంటూ తెలంగాణ నీటి హక్కులకు మరణ శాసనం రాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో అసెంబ్లీలో చర్చించేందుకు ఎప్పుడైనా సిద్ధమని తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టులను చంద్రబాబు అడ్డుకున్నారనీ, బనకచర్లపై కేంద్రానికి చతంద్రబాబు రాసిన లేఖలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎపి సిఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి బనకచర్లపై చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా చంద్రబాబుకు మద్దతు తెలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి కుట్రలు తెలియగానే బిఆర్ఎస్ నిలదీసిందని గుర్తుచేశారు. అపెక్స్‌లో బనకచర్ల లేకున్నా ..ఉందని సిఎం అబద్ధాలాడుతున్నారని తెలిపారు. రెండు నదుల నీళ్ల కొల్లగొడుతున్న హరీశ్ రావు తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ద్రోహం చేసిందని విమర్శించారు. తెలంగాణ సాధించిన కెసిఆర్ కృష్ణా నీటిలో వాటా కోసం కూడా పోరాడారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో పది లక్షల ఎకరాలకు నీళ్లిచ్చి, పాలమూరు ప్రాజెక్టుకు రూ.28 వేల కోట్లు ఖర్చు చేసి, నాలుగు రిజర్వాయర్లు పూర్తి చేసినట్టు గుర్తుచేశారు.

హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్

- ప్రభుత్వాస్పత్రుల్లో మరో 7 వేల పడకలు
- సిఎం రేవంత్ రెడ్డి

ఎఐజి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్ మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని బంజారాహిల్స్‌లో ఆయన ఎఐజి ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నట్టు తెలిపారు. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్ గా ఉంటుందని చెప్పారు. హెల్త్ టూరిజంలో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారునిగా నియమించినట్టు తెలియజేశారు. హెల్త్ టూరిజంగా మార్చే ప్రభుత్వ ప్రయత్నంలో భాగస్వామి కావాలని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. పది లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నదని గుర్తుచేశారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టేందుకు సరైన విధానంతో ముందుకెళ్తున్నట్టు సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్న వివిధ ప్రభుత్వాస్పత్రులు ప్రారంభమైతే మరో ఏడు వేల పడకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ప్రత్యేకంగా హెల్త్ ప్రొఫైల్ కార్డులను అందజేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఒక యూనిక్ ఐడితో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని వివరించారు. గతంలో ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థ ఉండేదనీ, ప్రస్తుతం స్పెషలిస్టు డాక్టర్ల రోజులు వచ్చాయని తెలిపారు.

ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పోటీదారులను ఎఐజి ఆస్పత్రి సందర్శన వంటి కార్యక్రమాలు చేపట్టినట్టు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కార్పొరేట్ ఆస్పత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తామని తెలిపారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11,500 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమాలకు ప్రయివేటు వైద్యులూ సహకరించాలని కోరారు. ఏడాదిలో ఒక నెల రోజులపాటు సామాజిక బాధ్యతగా ప్రభుత్వాస్పత్రుల్లో సేవలందించాలన్నారు. పశ్చిమాసియా దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. ఆయన హైదరాబాద్‌కు, తెలంగాణకు గొప్ప పేరు తెచ్చారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తుచేశారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్న అవార్డుకు అర్హులని అభిప్రాయపడ్డారు. భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. 66 దేశాల నుంచి రోగులు ఎఐజి ఆస్పత్రిలో చికిత్స కోసం రావడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన పట్టాభి అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బివి పట్టాభిరామ్ (75) అంత్యక్రియలు బుధవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో కుటుంబసభ్యులు నిర్వహించారు. మంగళవారం ఆయన గుండెపోటుతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఖైరతాబాద్ ఆనంద్ నగర్‌లోని నివాసంలో పట్టాభి భౌతికదేహానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సివై సోమయాజులు, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ, రామకృష్ణ మఠ్‌కు చెందిన సుఖబోధానంద, పలువురు సినీ రాజకీయ, వైద్యరంగ ప్రముఖులు ఆయనకు నివాళు లర్పించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆనంద్‌నగర్ నుంచి పట్టాభి అంతిమయాత్ర ప్రారంభమైంది. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

In The Court Of The Principal Junior Civil Judge Cum Judicial Magistrate Of First Class Anantapuramu

O.S. No: 660/2021

Between:

M.Sathyanarayana Murthy ...Plaintiff

And

S.Mahaboob Hussain ...Defendant

Notice to the Defendant

To,

S.Mahaboob Hussain S/o Shaik Mahaboob Miya, P.G. Teacher, (Mathematics) University of Hyderabad, College of Integrated Studies Gachibowly, Hyderabad, Telangana State.

పై నెంబరు కేసులో Defendant అయిన మీ హాజరు నిమిత్తము 7-07-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

D.SHYAM SUNDER, K.MOHAN RAO,
Advocates, Ananthapuram.
Cell: 9440258700

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL - CUM - II ADDITIONAL DISTRICT JUDGE, KADAPA AT PRODDATUR

M.V.O.P. No. 113/2023

Yerragudi Rama Chandra Reddy, S/o Chinna Yerikala Reddy, aged about 42 years, Hindu, Formerly cultivation, now un-employee, resident of D.No.3/46, Nagayapalli Village, Kamanur, Proddatur Mandal, Kadapa District. (Aadhaar No. 2312 8241 3832). ...Claimant

Vs

1. Khaja Aijazuddin, S/o Mohammad Sardar, aged not known, but major, Hindu, Owner of the Innova Car bearing No.AP-13-L-1789, resident of D.No.9-4-77/115/A, AI Hasnath Colony, Golkonda, Hyderabad-8, Telangana State.. ...Respondent No.1

The claimant filed the petition in the above matter against you, if you have got any objection you may appear before this Hon'ble Tribunal at 10.30 A.M, on or before 16-07-2025, either in person or through an Advocate and file your objection, if you failed to do so, the matter will be decided exparte.

E.V.SUDHAKAR REDDY, B.Com.,B.L.,
S.NOORULLAH, B.Sc.,B.L.,
Advocates, PRODDATUR.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

ప్రకటించిన సిగాచీ యాజమాన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని కంపెనీ యాజమాన్యం ప్రకటించింది. ప్రమాదానికి సంబంధించి సిగాచీ తరఫున తొలిసారి కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. పేలుడు కారణంగా 40 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు. మరో 33 మంది గాయపడినట్లు తెలిపారు. గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్మికులకు అన్ని రకాల బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తామన్నారు. క్షతగాత్రుల వైద్య ఖర్చులు భరిస్తామని.. వారి కుటుంబ పోషణ చూస్తామని తెలిపారు. ప్రమాదంపై స్టాక్‌మార్కెట్లకు కూడా ఆయన లేఖ రాశారు. ఈ ఘటనకు రియాక్టర్ పేలుడు కారణం కాదని తెలిపారు. ప్రభుత్వ విచారణ నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. మూడు నెలల వరకు ప్లాంట్‌లో కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు వివేక్ కుమార్ పేర్కొన్నారు. పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సిగాచీ డైరెక్టర్ చిదంబరం పరామర్శించారు.

నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం

సిగాచి కంపెనీలో జరిగిన భారీ పేలుళ్లకు కారణాలేంటనేది నిగ్గుతేల్చేందుకు నలుగురు శాస్త్రవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ వేసింది. చైర్మన్‌గా సిఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్, సభ్యులుగా శాస్త్రవేత్తలు డాక్టర్ టి.ప్రతాప్‌కుమార్, డాక్టర్ సూర్యనారాయణ, పూణెకు చెందిన భద్రతా అధికారి డాక్టర్ సంతోష్ ఘుగేను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

14న సిఎం చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ

- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, లక్ష్మణ్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 14న ముఖ్యమంత్రి చేతుల మీదుగా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని మంత్రులు తెలిపారు. అప్పటివరకు రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 13లోగా పరిశీలించి అర్హులైన వారందరిని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని, ప్రతిరోజూ రైతులకు సంబంధించిన అంశాలపై మండల స్థాయి అధికారులతో జిల్లా అధికారి పర్యవేక్షణ చేయాలని మంత్రులు సూచించారు. రైతు భరోసా, రైతు బీమా, ఎరువులు, విత్తనాల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, భూసేకరణపై ఎమ్మెల్యే దృష్టి నిలపాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ పనుల పునఃప్రారంభానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1200 కోట్లతో అన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు హామ్ పథకం కింద డబుల్ రోడ్ల నిర్మాణం చేపడతామని, పంచాయతీరాజ్ రోడ్లను కూడా హామ్ కిందకు తీసుకొస్తున్నట్టు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణపై ప్రత్యేకంగా రివ్యూ చేస్తామని చెప్పారు. ప్రాథమిక వైద్యం, విద్య ప్రభుత్వానికి అతి ముఖ్యమైనవని, వీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, నేనావత్ బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్‌నాయక్, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మెన్ గుత్తా అమిత్‌రెడ్డి, కలెక్టర్లు ఇల్లా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్‌నందలాల్ పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మూడు జిల్లాల అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

'మానిటైజేషన్' స్కీమ్‌ను రద్దు చేయాలి

- ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలి
- సింగరేణిని బలహీనపరుస్తున్న ప్రభుత్వాలు : పాలడుగు భాస్కర్
- దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి కార్మిక సంఘాల నేతల పిలుపు

ధర్నాలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ స్కీమ్ రద్దును చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. బిఇఎల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు సౌందర్ రాజన్ అధ్యక్షతన బుధవారం కార్మిక సంఘాల నాయకులు హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పదేండ్లలో ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు రూ. నాలుగు లక్షల కోట్ల వాటాలను విక్రయించిందని, 2025-26లో రూ.47 వేల కోట్ల వాటాలు విక్రయించిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మక సింగరేణి సంస్థలో వాటాలు విక్రయించనప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల దాన్ని ఆర్థికంగా, భౌతికంగా బలహీనపరుస్తున్నారని విమర్శించారు. 20 ఏళ్లుగా లాభాలు గడిస్తూ, అవార్డులు వస్తున్నప్పటికీ మైన్స్, బొగ్గు బావులను ప్రయివేటు సంస్థలకు కట్టబెడ్తున్నారని తెలిపారు. సింగరేణిలో పదేళ్లుగా రిక్రూట్‌మెంట్ చేయకుండా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బందిని నియమిస్తున్నారని, ఈ నిర్ణయాలను ప్రభుత్వరంగ సంస్థల్లోని ప్రతి పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుడు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రయివేటీకరణ విధానాలు, వ్యూహాత్మక అమ్మకాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ వంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు బలహీనపడుతున్నాయన్నారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు మాట్లాడుతూ.. 1957 గనుల చట్టాన్ని కేంద్రం సవరించిందని, ఈ చట్టంలో ఉన్న 12 అణు ఖనిజాల జాబితా నుంచి లిథియం, చెరిబియం, నియోబియం, టైటానియం, జెర్కోనియం వంటి ఖనిజాలను ప్రయివేటు రంగానికి పూర్తిగా కట్టబెట్టాలని నిర్ణయించిందని తెలిపారు. సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ జె వెంకటేష్ మాట్లాడుతూ బిడిఎల్ ప్రతి ఏడాదీ రూ. మూడు వేల నుంచి రూ. నాలుగు వేల కోట్ల ఉత్పత్తిని సాధిస్తోందని, అయితే 2012 నుంచి దాదాపు 700 మంది రిటైర్ కాగా.. ఒక్క పర్మినెంట్ ఉద్యోగిని కూడా నియమించకపోవడం అన్యాయమన్నారు. ఈ నెల తొమ్మిదిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నారాయణరావు మాట్లాడుతూ.. బీఈఎల్‌లో పదేండ్లలో సుమారు 200 మంది రిటైరయ్యారని, ఇంజినీర్లను 2 నుంచి 5 ఏళ్ల ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయిమెంట్‌లో నియమిస్తున్నారని తెలిపారు. వివిధ పబ్లిక్ సెక్టార్స్ నుంచి నాయకులు మాట్లాడుతూ.. సార్వత్రిక సమ్మెను ప్రభుత్వరంగ సంస్థల్లోని పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, బిఆర్‌టియు నాయకులు కాశ్‌రెడ్డి, బిహెచ్ఇఎల్ నాయకులు రెహమాన్, స్వామి, పెంటయ్య, బిడిఎల్ నాయకులు మురళి, సత్తయ్య, దాసకర్ణాచారి, బిఇఎల్ నాయకులు నిరంజన్, హెచ్ఎల్ నాయకులు వెంకటాద్రి, ఇసిఐఎల్ నాయకులు విఎస్ బోస్, భాస్కర్ రెడ్డి, మహిపాల్, మిథాని నారాయణరావు, నర్సప్పు, బిఎస్ఎన్ఎల్ నాయకులు సాంబశివరావు పాల్గొన్నారు.

వైద్యులకు ఫెర్నాండెజ్ హాస్పిటల్ సత్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్

డాక్టర్స్ డే సందర్భంగా ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, ఎండి డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ ఉత్తమ వైద్యులను సన్మానించారు. నిత్యం ప్రాణాలను ప్రపంచంలోకి తెస్తూ, కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్న వైద్యులు ప్రతిరోజు నిశ్శబ్దంగా చేసే పోరాటాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. "మనలో చాలా మందికి, వైద్యులు గొప్పవారు, అద్భుతాలు చేసేవారు, ఆరోగ్యాన్ని ప్రసాదించేవారు. వైద్యులు మనసులను నయం చేస్తారు. దేహాలను బాగుచేస్తారు. ఈ లోకంలోకి కొత్త ప్రాణాలను తీసుకువస్తారు. కానీ ఆ మాస్కులు, తెల్లటి దుస్తుల వెనుక, భయాలు, ఓటములు, విజయాలను సమానంగా భావించే ఓ మనిషి ఉంటాడు. దురదృష్టవశాత్తు ప్రాణాలు పోతే ఆ బాధను, దుఃఖాన్ని మౌనంగా భరిస్తారు. అయినప్పటికీ ఇంకొకరి ప్రాణం నిలపడానికి సిద్ధంగా ఉంటారు. ఇతరుల ప్రాణాలు నిలపడం కోసం కష్టపడాలనే తపన వారిలో ఎల్లప్పుడూ ఉంటుంది" అని ఎవిటా పేర్కొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు

- లేఖలు రాసినంత మాత్రాన బనకచర్ల ఆగదు
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణ ప్రాంతానికి నష్టం చేయనున్న బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలంటే లేఖలు రాసినంత మాత్రాన సరిపోదు.. ఇక్కడ ఉన్న చంద్రబాబు కోవర్టులను టైట్ చేస్తేనే ఆ ప్రాజెక్టు ఆగుతుంది.." అని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీఘనపూర్ గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎపి సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారని, పెద్ద కాంట్రాక్టులన్నీ వాళ్లే చేస్తున్నారని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలు, రోడ్డు కాంట్రాక్టులు, హైదరాబాద్‌లో దందాలు కూడా వాళ్లే చేస్తున్నారని అన్నారు. ఆ కోవర్టులకు నల్లా కలెక్షన్లు, కరెంటు కనెక్షన్లు కట్ చేయండి, ఇరిగేషన్ ప్రాజెక్టులలో కాంట్రాక్టులు బంద్ చేయండి.. బిల్లులు ఆపండి.. అని సాగు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సూచించారు. అప్పుడు వాళ్లే వెళ్లి చంద్రబాబు కాళ్లు పట్టుకొని బనకచర్ల బంద్ చేయిస్తారని అన్నారు. మంచిగా చెబితే ఎవరైనా వినరని, ఈ పని చేస్తే వారం రోజుల్లో బనకచర్ల బంద్ అవుతుందని చెప్పారు.

సిగాచి ఘటనపై నిపుణుల కమిటీ

- వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నలుగురితో కూడిన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కమిటీకి చైర్మన్‌గా సిఎస్ఐఆర్-ఐఐసిటి శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా సిఎస్ఐఆర్-ఐఐసిటి చీఫ్ సైంటిస్ట్ టి.ప్రతాప్‌కుమార్, రిటైర్డ్ శాస్త్రవేత్త టి ప్రతాప్‌కుమార్, సిఐఎస్ఆర్-ఎన్‌సిఎల్ (పుణే విభాగం) భద్రతా అధికారి సంతోశ్ గుగే ఉన్నారు. సిగాచి పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా? అని అధ్యయనం చేయాలని కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. దానిపై నెలరోజుల్లోగా నివేదిక అందజేయాలని విన్నవించింది. భవిష్యత్తులో పరిశ్రమల్లో అలాంటి ప్రమాదాలు జరగకుండా చూసేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జిఒ నెంబర్ 277ని విడుదల చేసింది.

'సిగాచి' ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- మోడీ రూ.రెండు లక్షలు భిక్షం వేస్తున్నారా?
- కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో విచారణ చేయండి : ఎస్ వీరయ్య

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, మృతులు, గాయపడిన వారి కుటుంబాలకు ప్రభుత్వమే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదానికి కారణం యాజమాన్యాల బాధ్యతారాహిత్యమేనని తెలిపారు. మృతుల్లో ఎక్కువగా ఒడిశా, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ కార్మికులు ఉన్నారని చెప్పారు. పొట్టకూటి కోసం వలసొచ్చిన కార్మికులు పని ప్రదేశాల్లో ప్రాణం కోల్పోతుంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యాలకు మద్దతు తెలిపేలా చట్టాలు తేవడం బాధాకరమన్నారు. సిగాచి ప్రమాదంపై ప్రధాని మోడీ స్పందించడం సంతోషకరమని, కానీ మృతుల కుటుంబాలకు రూ.రెండు లక్షలు ప్రకటించడమంటే భిక్షం వేస్తున్నారా? అని ప్రశ్నించారు. దేశంలో మహిళలపై దాడులు, సామూహిక లైంగికదాడులు జరుగుతుంటే నోరు విప్పని ప్రధాని మోడీ.. తెలంగాణలో సిగాచిపై నోరు విప్పడం రాజకీయ నాటకాల కోసమేనని విమర్శించారు. అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1979.. కార్మికుల సంక్షేమం, పని ప్రదేశాల్లో వారి రక్షణ కోసం ఉద్దేశించినదని వివరించారు. అలాంటి చట్టం అమలు చేస్తే కార్మికులకు భద్రత, హక్కులు లభిస్తాయన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించడం, మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించడం అభినందనీయమన్నారు. కానీ ఆ ఎక్స్‌గ్రేషియా యాజమాన్యాలు చెల్లిస్తాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగి.. కార్మికులతోపాటు జనరల్ మేనేజర్ స్థాయి ఉద్యోగి మృతిచెందినా నేటికీ కంపెనీ ఎండీ ఘటన స్థలానికి రాలేదన్నారు. యాజమాన్యం తగిన రీతిలో స్పందించలేదన్నారు. తీవ్రంగా గాయపడి పని చేయలేని పరిస్థితుల్లో ఉన్న వారికి రూ. పది లక్షల సహాయం సమంజసం కాదని, కనీసం రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు, కంపెనీల యాజమాన్యాలు కుమ్మక్కు కావడంతోటే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మూసీ పూర్తిగా విషపూరితమైందని, ఆ నీరు వ్యవసాయానికి, తాగునీటికి ఉపయోగపడదని తెలిపారు. సుమారు రూ.360 కోట్లతో బస్వాపురం ప్రాజెక్టు పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో మూసీ నీరు లేకుండానే వ్యవసాయం చేయొచ్చన్నారు. గోదావరి, కృష్ణా జలాలను మూసీలోకి తరలించాలని కోరారు. మూసీ ప్రక్షాళన తర్వాత, పరివాహక ప్రాంతాల వారికి నష్టం చేకూర్చకుండా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే అభ్యంతరం లేదన్నారు. కానీ, ఆ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ యాజమాన్యాలకు, కార్పొరేట్ శక్తుల పొట్టలు నింపడానికి ప్రయత్నం చేస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. బనకచర్ల నీటిని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి వాటాలు పంచుకోవాలన్నారు. నేటికీ తెలంగాణ ప్రభుత్వం నికరజలాలను వాడుకోలేకపోతోందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు లేకుండా ఏకపక్షంగా పోతే తెలంగాణకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ తదితరులు ఉన్నారు.

ప్రయివేట్ స్కూల్ బస్సును అడ్డుకున్న గ్రామస్తులు

స్కూల్ బస్సులను గ్రామస్తుల అడ్డగింత

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో యువకులు, వివిధ పార్టీ నాయకులు, గ్రామస్తులు బుధవారం ప్రయివేట్ స్కూల్ బస్సులను గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. "ప్రయివేట్ స్కూల్స్ వద్దు.. ప్రభుత్వ బడే ముద్దు" అంటూ నినదిస్తూ స్కూల్ బస్సులను ఆపి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రయివేట్ పాఠశాలలకు పంపకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపి విద్యను అభ్యసించేలా విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు. వేలకువేలు ఫీజులు చెల్లించి జేబులు గుల్ల చేసుకోవద్దని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కాదని ప్రయివేట్ పాఠశాలలకు పిల్లలను పంపించొద్దని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిహెచ్ఎస్ స్కూల్ చైర్మన్ ఊకంటి నిర్మల, ప్రైమరీ స్కూల్ చైర్మన్ మచ్చిక వసంత, నాయకులు నిమ్మల విజేందర్, రొంటాల వెంకటస్వామి, జున్నుపాల కుమారస్వామి, అకుతోట తిరుపతి, దేశ్మీ కిరణ్, మచ్చిక శివ శంకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల సాధన కోసం రేపు 'సచివాలయం ముట్టడి'

- డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ల విడుదల చేయాలనీ, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, యువతీ, యువకులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు కేవలం గత ప్రభుత్వ నోటిఫికేషన్లతో కలిపి 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని వివరించారు. ఇంకా 1.45 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైన ఉందన్నారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్‌ను నామమాత్రంగా ప్రకటించి అమలు చేయడం లేదన్నారు. గత బిఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నదని అన్నారు. స్పష్టమైన జాబ్ క్యాలెండర్‌ని ప్రకటించి అమలు చేయాలనీ, ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేంతవరకు నిరుద్యోగ యువతకు ప్రతి ఒక్కరికి నెలకు రూ.నాలుగు వేలు నిరుద్యోగ భృతిని ఇస్తామని చెప్పి నేటికీ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని చెప్పారు. నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావించకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. అనేక ఆశలతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు. ఉద్యోగ అవకాశాలను కల్పించకుండా కాలం వెళ్లదీస్తున్నదన్నారు. గొప్ప గొప్ప ప్రచార ఆర్భాటాలు నిర్వహిస్తూ ప్రకటనలకే పరిమితమవుతున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి రుణాల కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభిస్తున్నామంటూ చెప్పి దరఖాస్తులను స్వీకరించిందని వివరించారు. జూన్ రెండో తేదీన లబ్ధిదారులందరికీ నిధులు మంజూరు చేస్తామంటూ ప్రకటించినా, ఇప్పటికీ ఏ ఒక్కరికీ ఆ పథకాన్ని అమలు చేయలేదని అన్నారు. నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం ఎలాంటి షరతుల్లేకుండా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జావీద్, కృష్ణా నాయక్, నాయకులు రాజు, భరత్, రాజేష్, నరేందర్, ప్రవీణ్, మల్లేష్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రీ కెవైసికి యూనియన్ బ్యాంక్ మెగా క్యాంపెయిన్

- రెండేళ్లకోసారి కెవైసి తప్పనిసరి

హైదరాబాద్ : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మార్గదర్శకాల ప్రకారం అధిక రిస్కు కలిగిన ఖాతాదారులు రెండేళ్లకోసారి నో యువర్ కస్టమర్ (కెవైసి) డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతి ఖాతాను కస్టమర్ వృత్తి ఆధారంగా తక్కువ, మధ్యమ, అధిక రిస్క్‌గా వర్గీకరించాల్సి ఉంటుందని తెలిపింది. తక్కువ రిస్క్ కలిగిన ఖాతాదారులు 10 సంవత్సరాలకు ఒకసారి, మధ్యమ రిస్క్ కస్టమర్లు 8 సంవత్సరాలకు, అధిక రిస్క్ కస్టమర్లు 2 సంవత్సరాలకు ఒకసారి కెవైసిని సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, రీ కెవైసి పోర్టల్, కార్పొరేట్ వెబ్‌సైట్‌లో కెవైసిని అప్‌డేట్ చేసుకోవాలని తెలిపింది. లేదా వాట్సాప్ బ్యాంకింగ్ 9666606060కు హై అని పంపడం ద్వారా డాక్యుమెంటేషన్ సమర్పించవచ్చని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రదేశాలు, శాఖలలో కస్టమర్లు రీ-కెవైసి నవీకరించడానికి ఒక మెగా క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. కెవైసి నవీకరణ కోసం సమీప శాఖను సందర్శించాలని లేదా బిజినెస్ కరస్పాండెంట్స్‌ను సంప్రదించాలని సూచించింది.

రూ.21 లక్షల మద్యం ధ్వంసం

- రోడ్డు రోలర్‌తో తొక్కించిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు, మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి గూడెం గ్రామ శివారులో అప్పట్లో పోలీసులు దాడులు చేసి పెద్దమొత్తంలో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాన్ని ఆదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం ఆసిఫాబాద్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్, రెవెన్యూ శాఖ అధికారులు ఇన్‌చార్జి తహసీల్దార్ మడవి డౌవులత్, సీనియర్ అసిస్టెంట్ జాఫర్ పంచు ధ్వంసం చేశారు. రూ.21లక్షల 50వేల 890 మద్యాన్ని రోడ్డు రోలర్‌తో తొక్కించారు.

ఐఎంటిలో ముగిసిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - హైదరాబాద్

అభ్యుదయ్ 2025 మేనేజ్‌మెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను ముగిసిందని ఐఎంటి హైదరాబాద్ తెలిపింది. 2025-27 బ్యాచ్ కోసం జూన్ 18న ప్రారంభించిన ఈ కార్యక్రమం పిజిడిఎం విద్యార్థుల విద్యా ప్రయాణంలో కీలకమైన ఘట్టంగా నిలిచిందని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. దీనికి పలు రంగాలు, పరిశ్రమలకు చెందిన వృత్తి నిపుణులు హాజరై కీలక అంశాలపై మాట్లాడారని తెలిపింది. విద్యార్థుల విద్యా, వృత్తిపరమైన వృద్ధికి అవసరమైన ఆచరణాత్మక సాధనాలను అందించినట్లు ఐఎంటి హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బహరుల్ ఇస్లాం పేర్కొన్నారు.

న్యాయవాది కల్లూరి సాయినాథ్ మృతికి సంతాపం

- ఐలూ రాష్ట్ర, హైదరాబాద్ కమిటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

న్యాయవాది కల్లూరి సాయినాథ్ మరణం పట్ల ఆల్ ఇండియా లాయర్స్ (ఐలూ) రాష్ట్ర కమిటీ, హైదరాబాద్ జిల్లా కమిటీలు ప్రగాఢ సంతాపాన్ని తెలిపాయి. ఆయన కుటుంబానికి సానుభూతి చెప్పాయి ఈ మేరకు బుధవారం ఐలూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి విద్యాసాగర్, అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, ఐలూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డి.ప్రవీణ్, కార్యదర్శి సి.రామ చంద్రారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఐలూ హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యులు సాయినాథ్ (30) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. అతను నిజాయితీ, అంకితభావం కలిగిన న్యాయవాది అనీ, చిన్న వయస్సులోనే మరణించారని విచారం వ్యక్తం చేశారు.

మళ్లీ వర్షంతో పత్తికి పదును

- రైతుల్లో హర్షం
- దెబ్బతిన్న మొక్కల స్థానంలో మరోమారు విత్తనాలు
- ఇతర పంటలకూ అదనయ్యేలా వర్షపాతం
- రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో సాగు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో సంతోషం నెలకొంది. గతనెల రాష్ట్రంలో అనేకచోట్ల చెదురుమదురు వానలే కురవడంతో గింజలు విత్తుకునేంత పదును లేక మొలకలు రాలేదు. అక్కడక్కడ వచ్చిన మొలకలు కూడా అధిక ఉష్ణోగ్రతలకు వడలిపోయాయి. జూన్ 29 నుంచి రుతుపవనాల ప్రభావంతో పత్తి, ఇతర పంటలకూ అదునయ్యేలా వర్షాలు పడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత నెల సగటున 30 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదయింది. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కాస్త కుడిఎడుమ ఇంతే మొత్తంలో వర్షాలు కురిశాయి. కనీసం సగటున 60 మి.మీ వర్షం కురిస్తే గానీ పత్తి విత్తనాలు మొలకెత్తవు. కానీ దానిలో సగం వర్షపాతం మాత్రమే నమోదవడటంతో బావుల కింద మినహా మిగిలిన చోట్ల విత్తనాలు దెబ్బతిన్నాయి. 40 శాతం గింజలు కూడా మొలకెత్తకపోవడంతో దుక్కులు చెడగొట్టారు. తద్వారా ఒక్కో రైతు ఎకరానికి రూ.8వేలకు పైగా నష్టపోయాడు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వానలకు భూమి పదునెక్కుతోంది. అప్పుడు గింజలు మొలకెత్తని చోట మరోసారి నాటేందుకు రైతాంగం సిద్ధమవుతోంది. పత్తికే కాదు ఇతర పంటలకు కూడా జీవం పోసేలా వానలు కురుస్తుండడంతో రైతుల్లో సంతోషం వెల్లువిరుస్తోంది.

దెబ్బతిన్న చోట మళ్లీ విత్తేందుకు సిద్ధం

సరైన పదును లేక విత్తనాలు మొలకెత్తని చోట మళ్లీ గింజలు నాటేందుకు రైతాంగం సిద్ధమవుతోంది. తెలంగాణలో వరి తర్వాత అధిక విస్తీర్ణంలో సాగయ్యే పంట పత్తి. రాష్ట్రంలో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 1.34 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా. దీనిలో 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని లెక్కలు వేశారు. ఖమ్మం జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 2.13 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. కొత్తగూడెం జిల్లాలో 2.14 లక్షల ఎకరాలకు గాను దాదాపు రెండు లక్షల ఎకరాల్లో గింజలు నాటారు. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల ఎకరాలకు గాను 45 లక్షల ఎకరాలకు పైగా నాటినా కనీసం 15 లక్షల ఎకరాల్లో విత్తనాలు సరైన పదును లేక దెబ్బతిన్నాయి.

ఆశాజనకంగా వానలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడురోజులుగా ఆశాజనకంగా వానలు కురుస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో జూన్ 29వ తేదీన సగటున 31.6 మి.మీ, 30న 30.8 మి.మీ, జులై 1న 22.7 మి.మీ వర్షపాతం నమోదైంది. మూడురోజులుగా జిల్లా మొత్తమ్మీద 60 మి.మీ వర్షం నమోదైంది. ఈ వర్షాలతో విత్తనాలకు సరైన తేమశాతం సమకూరనుంది. ఉమ్మడి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు పైగా పత్తి విత్తనాలు నాటారు. వీటిలో 40శాతం మేర విత్తనాలు మొలకెత్తలేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 4.82 లక్షల చొప్పున విత్తనాలు అవసరం కాగా ఈమేరకు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు దెబ్బతిన్న విత్తనాల స్థానంలో నాటేందుకు అవసరమైన విత్తనాలు కూడా లభిస్తున్నాయి. గతేడాది 450 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్ రూ.864 ఉంటే ఈ ఏడాది రూ.37 పెరిగి రూ.901కి చేరింది. ఎకరాకి రెండు ప్యాకెట్లకు రూ.1,802 చొప్పున విత్తనాలకు వెచ్చించారు. ఇప్పుడు చావు గింజలకు మరో రూ.901 వెచ్చించాల్సి ఉంటుంది. ఒకవేళ గింజలు అధిక మొత్తంలో మొలకెత్తకపోతే మొత్తం దుక్కిని చెడగొట్టాల్సి ఉంటుంది. అదే జరిగితే ఒక ప్లవ్ ఖర్చు రూ.3,000 మినహా మిగిలిన అన్ని పెట్టుబడులు మళ్లీ వెచ్చించక తప్పదు. కాబట్టి రైతుపై రూ.8వేల అదనపు భారం పడుతుంది.

జులై 20 వరకు పత్తి విత్తనాలు నాటొచ్చు : సరిత, ఎడిఎ, కూసుమంచి

పత్తి విత్తనాలను జులై 20వ తేదీ వరకు విత్తుకోవచ్చు. ఈ ఏడాది చాలా మంది రైతులు ఒకటి, రెండు తేలికపాటి వర్షాలు పడగానే నాటారు. కొంత మేర విత్తనాలు మొలకెత్తక నష్టపోయారు. కనీసం 60 మి.మీ వర్షపాతం నమోదైతేనే నాటాలని సూచించినా ఎక్కడ వెనుకబడి పోతామోనని చాలా మంది రైతులు పెడచెవిన పెట్టారు. ఇప్పుడు కావాల్సిన వర్షం కురుస్తుంది కాబట్టి నేలకు అనువైన బీటీ విత్తన రకాలను ఎంచుకొని నాటాలి. నేల స్వభావం ఆధారంగా 40 నుంచి 42 అంగుళాల అచ్చువేసుకొని విత్తితే మంచి దిగుబడి వస్తుంది. తేలిక నేలల్లోనైతే అధిక సాంద్రత పద్ధతిలో 36-6 అంగుళాల దూరంలో లేదా దగ్గరగా సాగు చేసే పద్ధతి అయితే 32.12 అంగుళాల దూరంలో విత్తనాలు వేసుకోవాలి. అనువైన వంగడాలను ఎంచుకుంటే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. రెండో పంట కూడా సాగు చేయొచ్చు. పత్తి గింజలు నాటాక 48 గంటల్లో తేమ ఉంటే పెండి మిథాలిన్ 1.2 లీటర్లను ఎకరా చొప్పున పిచికారీ చేస్తే కలుపు ఉధృతి తగ్గుతుంది.

మిలింద్ ప్రకాశన్ సంచాలకులు విభా భారతి మృతి బాధాకరం

- హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిలింద్ ప్రకాశన్ ప్రచురణ సంస్థ సంచాలకులు, హిందీ పుస్తక ప్రపంచంలో పండితులు, సమాజ సేవకులు విభా భారతి(83) మృతి బాధాకరమని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ పేర్కొంది. సంతాపాన్ని ప్రకటించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. బుధవారం ఈ మేరకు బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు కె.బాల్‌రెడ్డి, శోభన్‌బాబు, సంయుక్త కార్యదర్శులు సూరిబాబు, సురేశ్, కోశాధికారి నారాయణరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నగరంలో హిందీ పుస్తకాలకు చిరునామాగా మిలింద్ ప్రకాశన్ సంస్థను తీర్చిదిద్దడంలో శృతికాంత్, విభాభారతి కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ప్రముఖ ప్రచురణ సంస్థల హిందీ పుస్తకాలను పంపిణీ చేస్తూ ప్రజల అందుబాటులోకి మిలింద్ ప్రకాశన్ తీసుకొచ్చిందని కొనియాడారు. ఆమె కాచిగూడలోని తన స్వగృహంలో మంగళవారం చనిపోయారని పేర్కొన్నారు. సొసైటీ తరపున ఆమె మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.